# ముత్యాలూ—మగవాళ్లూ

ఉమాదవి

తొలికోడి కూతకు ముందే ముత్యాలుకు మెలుకువ వచ్చింది...బద్ధకంగా లేచి వళ్లు విరుచుకుని ఆవలిస్తూ కళ్ళు నులుముకుంటూ గుడిసెలోంచి బైటికి వచ్చింది. వాకిట్లో నులక మంచంలో పడుకున్న మల్లిగాణ్ణి మోటుగా తడుతూ "నేవయ్యా ఓరయ్యో ... ఎకస్ ప్రెస్ టయమవుతా ఉండది. మరి నెగిసి బండికట్టు" అని ఒక్క కుదుపు కుదిపింది.

మల్లిగాడు తృళ్ళిపడి లేచాడు. "ఓసుండవే— ఎంత మంచి కూరుకొస్తా ఉండది!" అంటూనే ముత్యాలు మొహం చూడగానే చటుక్కున లేచి నిలుచున్నాడు.

ముంతతో ముత్యాలందించిన నీళ్లూ, కుందుం పుల్లా అందుకుని మొహం కడుక్కున్నాడు అయిష్టంగానే. తోటి రిక్షావాళ్ళలాగే మల్లిగాడికీ అంత పొద్దున్నే మొహం కడుక్కోవాలంటే యిష్టం ఉండదు. కానీ ముత్యాలు కడిగినముత్యం లాంటి పిల్ల. చిన్నతనాన్నుంచీ గొప్పోరిళ్ళల్లో పనిచేస్తూ రావటాన కాస్త శుచీ శుభ్రం వంటపట్టించుకుంది. తండ్రి ఎడ్డెమడ్డి అలవాట్లను మాన్పించటానికి అస్తమానమూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. తానూ శుభ్రంగా కడిగిన ముత్యంలా ఉంటుంది ఎప్పుడూ. ఏ వాడ పిల్ల అని చెప్పినా నమ్మరు ముత్యాలుని చూసినవాళ్లు.

మల్లిగాడు బయలుదేరుతుంటే "అయ్యా! సద్దిబువ్వ తెల్లారినాక వచ్చి తిందువులే—యీ బండి కెల్లిరా. నాకూ పనికి యాలవుతావుంది" అని చెప్పింది. "సరిలేయే బుల్లీ..." అంటూనే రిక్షా తీసుకుని హుషారుగా గంట మోగించుకుంటూ తొక్కుకుపోయాడు మల్లిగాడు.

ముత్యాలు మొహం కడుక్కొని తల గీరుకుని మొహాన దమ్మిడీ కాసంత ఎర్రని కుంకం పెట్టుకుని చీరె దులిపి కట్టుకుని చకచకా బయలుదేరింది. ఎందుకో తల్లి గుర్తుకువచ్చి కళ్లు చమర్చాయి. క్షణంలో దిటవు తెచ్చుకుని తడిక కట్టేసి మెరపు తీగలాగా బయలుదేరి వెళ్ళిపోయింది పనికి. మూడిళ్ళల్లో పాచిపని మూడుక్షణాల్లో ముగించి నట్టుచేసి అంటగిన్నెలూ అవీ వేయించుకుని నిమిషాలమీద తెల్లగా శుభ్రంగా తోమి మంచినీళ్లతో తొల్చి మరీ ఎవరిగిన్నెలు వారి గడపల్లో జాగ్రత్తగా బోర్లించింది. అప్పటికి తెలతెలవారొస్తోంది. ఇంక రామావతారంగారింటికి బయలుదేరింది. వారిల్లూ యీమూడిళ్ళ అవతలే...అయితే శారదాంబగారు అంత పొద్దున్నే లేవలేరు. పైగా కూతురుగూడా కాపరానికి వెళ్ళిపోయిందేమో యింట్లో మూడోమనిషి లేకపోవటాన ఉదయం కాఫీల బాదరబంది కూడా లేదుకాబట్టి అంత తొందరగా వెళ్ళాల్సిన అవసరమూ లేదు. ఈయిల్లే కాక యింకా మరి కాస్తపని ఉంది ముత్యాలుకి.

కూతురు గాయత్రి కాపరానికి వెళ్ళాక అంత మేడలో వంటరిగా ఉండటం కష్టమనిపించింది రామావతారంగారికి. ఆయన మంచి లౌక్యం తెలిసిన వ్యవహర్త...ఇద్దరు మనుష్యులు అంతయింటిని ఆక్రమించుకుని వాడుకోటమూ అక్రమమే అనిపించి మేడక్రింద నాలుగుగదులు వరసగా కాలేజి స్టూడెంట్సుకి విడివిడిగా అద్దెకిచ్చేశారు. గది యిరవైరూపాయల చొప్పున. గదికి ముగ్గురూ నలుగురూ లెక్కన ఉన్నారు. వాళ్ళకిగూడా పని ముత్యాలే చేసిపెడుతుంది. గదులూడ్చి స్నానాలకి నీళ్లు తోడటంలాంటివి చేస్తుంది. అసలు నీళ్ళకి పంపే ఉంది.

కాబట్టి అంతా పంపుదగ్గరే చేరతారు. కాస్త బద్ధకస్తుడు నిద్రపోయేలాగా లేవలేని వాడెవడైనా

ఉంటే గది గడపలోకి ఒక బాల్చీ నీళ్ళు తెచ్చి పెడుతుంది. అన్ని గదుల్లోకీ కూజాల్లో మంచి నీళ్ళు తెచ్చి ఉంచుతుంది. వాకిట్లో కాళ్ళూ మొహాలూ కడుక్కోటానికి కుండల్లో నీళ్ళు పోసి వెళ్తుంది. వాళ్ళు తాగే హార్లిక్సు, కాఫీ, ఓవల్టీను, పాలూ యిత్యాది పానీయాల గ్లాసులు శుభ్రంచేసి వెళ్తుంది రెండు పూటలా. వాళ్ళంతా భోజనాలు హోటళ్ళలోనే చేసి వస్తారు. వాళ్ల పెందలాడే ఎలాగూ లేపరు కాబట్టి ముందు యింటివారి పనులన్నీ పూర్తిచేసి క్రిందకు వస్తుంది. నాలుగిళ్ళల్లో పనీ గంటలో ముగించుకుని చలాకీగావచ్చి గదుల్లో పనికూడా నిమిషాలమీద ముగించుకుని వెళ్తుంది ముత్యాలు...ఇందుకు ప్రతిఫలంగా ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున యిస్తాడు

ఆమె వస్తోందంటే 'అదుగో—స్టేట్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది' అనుకుంటూ లేస్తారు యిల్లాళ్ళు. ఏపుగా ఎదిగి పరిపూర్ణంగా వికసించిన ఆమె దేహాన్నీ, అవయవ పరిపుష్టినీ చూచి అర్భకురాండ్రైన శ్రీమతులు ఈర్ష్యతో క్రుంగిపోతారు. నలుపులో కలిసే చామనఛాయ రంగులో ఉండీకూడా చాలా ఆకర్షణీయంగా ఉంటుంది ముత్యాలు. అందుకు ముఖ్యకారణం ఆమె దేహసౌష్టవమే చాలా మటుకు—దమ్మిడీ కాసంత కుంకం పెట్టుకుంటే కళ కళ లాడిపోతూ ఏ నగలూ లేని లోపం కనిపించనీకండా ఉంటుంది ముత్యాలు ముఖం.

* * *

ముత్యాలు తల్లి పోకముందు...అంటే రెండేళ్ళ నాటి సంఘటన...

రామావతారం గారమ్మాయి గాయత్రికి ఆ యేడే వివాహమయింది. అప్పట్లో ముత్యాలు తల్లి అచ్చాలే వాళ్ళింట్లో పని చేస్తూ ఉండేది. ఎదురింట్లో పని చేయటానికి కుదిరింది పదిహేనేళ్ళ ముత్యాలు. గాయత్రి తన అత్తారింట్లో పెద్దదిక్కు లేకపోవటాన యింట్లో హమేషా తోడుగాఉండే పనిపిల్ల కావాలని తండ్రికి రాసింది. తల్లికి నచ్చజెప్పి పోనంటూఉన్నా ముత్యాలును బ్రతిమాలి గాయత్రి దగ్గరకు పంపారు. తీరా మరో నెలకీ ముత్యాలును తీసుకుని గాయత్రి పుట్టింటికి చక్కావచ్చింది. తండ్రితో "నాన్నా... ముత్యాలు బెంగపడుతుందేమో—మరో పని వాణ్ణి ఎవడినైనా కుదుర్చుకుంటాములే—అయినా అలవాటయి పోయింది కాబట్టి వంటరిగా ఉండగలను" అని చెప్పింది గుంభనగా. అయితే తిరిగి వెళ్ళేముందు తల్లితో మాత్రం చాటుగా "అమ్మా! మీ అల్లుడుగారి బుద్ధి ఏమంత మంచిదిగా తోచటం లేదు. నాకంటే నదరుగా కనిపించే దీన్ని ఎప్పుడూ యింట్లోనే ఉంచుకుంటే ఎప్పుడు ఎవరికేం బుద్ధులు పుడతాయో...అలగా జాతివాళ్ళని నమ్మమనే ముంది? తరువాత ఎటుబోయి ఎటొచ్చినా ఎందుకొచ్చిన పీడా కారం బాబూ బ్రహ్మకైన బుట్టురిమ్మ తెగులు అంటారుగదూ అందుకే తీసుకొనొచ్చాను" అని రహస్యంగాచెప్పి మరీ వెళ్ళిపోయింది గాయత్రి. అయితే పదిహేనేళ్ళ ముత్యాలుకి యిందులోని అంతర్యం తెలియలా. ఏమయినా అమ్మదగ్గరికొచ్చేశాను అంతేచాలు అనుకుని మురిసింది ఆ పసి హృదయం.

తరువాత ఏడాదిలోనే అచ్చాలుని అమ్మోరొచ్చి ఎత్తుకెళ్ళింది గదా! అప్పటినుంచీ మతిచెడి నట్లయిపోయిన తండ్రిని ఓ కంట కనిపెట్టుకుని సంసారం దిద్దాల్సిన భారం ముత్యాలుదే అయింది. అచ్చాలు బ్రతికిఉండగా ముత్యాలుని జూచి ఊ మురిసేది.

"నా బంగారు కొండే—నా ముత్తెన్ని నా తమ్ముడు కనకాలు కిచ్చుకుంటాను - నాశరద - నా రకత సొరిశ" అని బులపాట పడేది. కాని ముత్యాలుకి ఆ మాట మటుకు నచ్చేదికాదు. కనిపించిన వాళ్ళ జేబులల్లా కొట్టి సారాయితాగి రోడ్లమీదపడి దొర్లింతలు పెట్టి తందనాలాడే 'మావ' అంటే దానికి మా చెడ్డరోత! "ఆడినోరు తెరిస్తే బూతుల పుట్టగందా! సీ—అణ్ణెవడు సేసుకుంటాడే!" అని ఆ మొహం అంతా చిట్లించుకుంటూ ఆ మూతిని యింత చేసుకుని చేతులూ వళ్ళూ తిప్పుకుంటూ అవతలికి పోయేది.

"అడికేమే—సిలిపితనం ఎప్పుడూ ఉంటదా? అయిన మొగోడు—సంపాదించో — కట్టంసేసో— ఆకరికి దొంగతనం సేసయినా పెళ్ళాన్ని పోసించుకోలేకపోడు" అనేది గర్వంగా అచ్చాలు.

కాకపోయినా ఆ కనకాలు ఆరు నెల్లకు రెండు సార్లయినా జైలు మొహం చూడకుండా ఉండేవాడు కాదు. క్రమేపీ అన్నిరకాల సావాసాలూ

అన్ని రకాల వ్యసనాలూ పట్టుకున్నాయి వాణ్ణి. ఇంతలో అచ్చాలు కూడా చెల్లిపోవటాన ముత్యాలు తెంపుచేసి తండ్రితో తెగేసి చెప్పేసింది. "ఆ దొంగ యెదవని—రౌడీనాయాల్ని నే నేసుకోనయ్యా" అని.

అవును మరి చెప్పకేంచేస్తుంది? ముత్యాలు అగ్గిలాంటి మనిషి. దాన్ని వేలొంచి చూపగల వాడా వాడలో ఉన్నాడూ? 'దొంగబ్రతుకు బ్రతికే కంటే కిట్టులో పడితే నయం" అటుంది! దాని జోలికి వచ్చేందుకు ఎవడికైనా గుండెలున్నాయీ? దూరాన్నుంచి తలెత్తి దానికేసే చూసినా, దగ్గిరి కొచ్చేసరికి మా లావు తలలైనా దిగాల్సిందే—రోడ్డంట నడుస్తో ఉంటే రౌడీసజ్జు "ఎర్రిసూపులు" సూత్తూ గుటకలు మింగుతారు. కాలేజీ అబ్బాయిలు సకిలిస్తూ ఈలలు కూడా వేసుకుంటారు. ఉద్యోగస్తులయిన పెద్దమనుష్యులు గట్టిగా తలెత్తి చూసేందుకు సభ్యత అడ్డువచ్చి ధైర్యం చాలక పక్కచూపులు దొంగవాటంగా చూస్తూ కొందరుంటే—గాగుల్సులోంచి స్వేచ్ఛగా చూసి ఆనందించే రసికశిఖామణులు మరి కొందరు.

ఎవరెలా చూచినా ముత్యాలు కేమీ జంకు లేదు. నిర్భయంగా పమిటకొంగు నడుము చుట్టూరా తిప్పి దోపి చకచకా నాలుగైదిళ్ళల్లో తన పని కానిచ్చుకుని పోతుంది. "నిప్పులాంటి మడిసి" ముత్యాలు.

* * *

కొద్దిరోజులనుంచీ ముత్యాలుకో సమస్యవచ్చి కూచుంది. మరేదో కాదు రామావతారంగారింట్లో ఉన్న స్టూడెంట్సు వరస దానికేమీ బాగాలేదు. ఒకడు గదిలో మంచంమీద పడుకునే—

"ముత్యాలూ—యిలాంటి సిగరెట్ పెట్టె ఆ బడ్డీలోంచి తెచ్చిపెట్టు" అని మీదికే డబ్బులు విసురుతాడు అవి ఎక్కడ తగిలేదీ చూడనట్టే చూస్తూ. మరొకడు 'ఇదుగో ముత్యాలూ—జేబులో అగ్గిపెట్టె ఉంటుంది. ఇలా తెచ్చిపెట్టు" అని పురమాయిస్తాడు.

ఇంకో చతురుడు ఆమె గది ఊడుస్తున్నంత సేపూ మంచంమీదే పడుకుని కళ్ళు మూస్తూ తెరుస్తూ నఖశిఖపర్యంతం ఆమెని చూపుల్తో తినేసేలా చేస్తాడు...ఇదంతా ఆమె తల వంచుకునే గ్రహించగలుగుతుంది. ఏమిటో యీ వికారాలూ, వెకిలిచేష్టలూ అనిపిస్తుంది ముత్యాలుకి. మూడో గదిలో ఎర్రటబ్బాయి వోవల్టీను రెండు గ్లాసులకు సరిపడా కావాలని కలిపి గిన్నెలో గ్లాసెడు మిగిల్చి—

"ముత్యాలూ — ఆ వోవల్టీను తాగెయ్యి" అంటాడు ఏ రోజూ—ఒకటి రెండు రోజులు 'పోనీలే గందా!' అని తీసుకుంది గాని మూడో నాటినుంచి అనుమానమేసింది. "ఎందుకయ్యా ఏరోజూ యింతింత కలిపి మిగల్చటం—మీరెవరైనా తాగండి—లేకపోతే కూస్తే కలుపుకోండి" అని కచ్చితంగా చెప్పేసింది...

ఆఖరు గదిలో బక్కాయన ఎప్పుడూ తనకేసి ఏదోగా సిగ్గేసేటట్టు దిగులుగా, తిక్కగా చూస్తాడు. అనేమన్నా జబ్బో ఏంపాడో—అందరూకలిసి ఓ ఆర్మణీపెట్టె సంపాదించి దాని మీద అన్నిరకాల సినిమా పాటలూ ఒకడు పదలగా మరొకడు వాయిస్తూ విధిగా ముప్పూటలా సాధకంజేస్తూ ఉంటారు. వారిలో ఒకడు వాడే రకం సబ్బూ, పేస్టూ, తలనూనె మరొకడు తీసుకురాడు. ఎప్పుడూ చీట్లాడుతూ, సిగరెట్లమీద సిగరెట్లు తగలేసే వీళ్ళనిచూసి శారదాంబగారికి ఆశ్చర్యం—వీళ్ళు చదువుకోటానికేనా వచ్చింది? అని—

ప్రతిరోజూ ముత్యాలుతో ఏదోరకంగా కలిపించుకుని సరదాగా మాట్లాడటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. వీళ్ళల్లో కొందరు "ఏం ముత్యాలూ—పొట్లాల్లాంటి చేతులు గదా చక్కగా తళుకు గాజులు వేయించుకోరాదూ—అంతగా డబ్బు లేకపోతే మేమివ్వమూ!" అంటారు.

"ఇదో ముత్యాలూ—చక్కగా జడేసుకుని పూలు పెట్టుకోరాదూ—మంచిగా బట్టలు వేసుకో కావలిస్తే యీ వాసన సబ్బు రుద్దుకోవచ్చులే—మేమేమీ అనుకోము" ఈ ధోరణిలో సాగించారు. తల్లి పోయిన బెంగతో అసలే అది తన పోషణ సంగతి పట్టించుకోటల్లా. వీళ్ళ అధిక ప్రసంగాలకి ముత్యాలుకి చిర్రెత్తుకొచ్చింది. పని మానేయాలనిపించిందిగాని వీళ్ళపొగరు మంచిగా యుక్తిగా అణచాలిగాని మానేస్తే మనిషికి రూపాయిచొప్పున యిస్తున్న వీళ్ళదగ్గర పదహారు రూపాయలపని పోదూ? ఈఅయిదారిళ్ళల్లో వచ్చే పాలికతోటేగా

తమయిల్లు ఏదోవిధంగా గుట్టుగా గడపటము—లేకపోతే తండ్రి తెచ్చే యిరవై ఏమూలకి? తల్లి దినానికి తెచ్చినబాకీ యింకా తీరుస్తూనేఉన్నారాయె!

• • •

ముప్పయ్యో తేదీ సాయంత్రం...

గదుల్లో విద్యార్థులు అందరూ చప్పబడి సినిమాలమాటే విస్మరించి నిరుత్సాహంగా కూర్చున్నారు. సంగీతాలు కాస్త సద్దుమణిగాయి. ఇంక నాలుగురోజులకిగాని ఇళ్ళదగ్గరనుంచి మనియార్డర్లు రావు. చిలకలావచ్చింది ముత్యాలు పదిమందీచేరిన గదిలో గాజులసెట్టిని వెంటబెట్టుకుని మరీ...కంబళీ పరుచుకుని కూర్చున్నారక్కడ ముత్యాలూ గాజుల బత్తుడూను. తళుకు బెళుకుల ఖరీదైన గాజులు బైటపెట్టాడు గాజులాయన. ఇదే సినిమాలా తోచింది విద్యార్థుల ప్రాణానికి. "ఇవెలా ఉన్నాయి బాబూ! యీ రంగు బావుందా?" అని



"అదేమిటి ముత్యాలూ! నువ్వు గాజులేయించుకుని మమ్మల్నివ్వమనటమేంటి?"

వాళ్ళనడుగుతూ రెండుచేతుల నిండా రూపాయికి ఎనిమిదీ ఆరూ చొప్పున వచ్చే ఖరీదైన తళతళా మెరిసిపోయే గాజులు చక్కగా వేయించుకుంది. తననిగాబట్టి సలహా అడుగుతోందని వాళ్ళింకా హుషారుగా ఏరి చూపారు రకరకాల గాజులు.

చక్కగా లేచి గాజుల మలారానికి శ్రద్ధగా బుద్ధిమంతురాలిలాగా నమస్కారం చేసింది. "పచ్చగా పసుపు కుంకంతో సిరిసంపదలతో పది కాలాలు వర్ధిల్లు" అంటున్న గాజులసెట్టి ఆశీస్సులు అందుకుని మహారాణిలా, రాజహంసిలా ఠీవిగా నడచి వెళ్ళిపోబోయింది. గాజులాయన గాభరా పడిపోయి డబ్బో అంటూ చుట్టూరా చూశాడు. "అదుగో ఉన్నారుగా యిందరు! వారినే అడుగు" అంటూనే బైటికి నడిచింది. ఇంతమందిలో ఎవరి నడగాలో తెలియక కంగారుపడ్డాడు. అంతకంటే తెల్లబోయింది విద్యార్థి బృందం—

"అదేమిటి ముత్యాలూ? నువ్వు గాజులేయించుకుని మమ్మల్నివ్వమనట మేమిటీ!" అన్నారా రూముగల విద్యార్థి.

"ఏంటండీ? పెద్ద కులమోరు—యింత సేటబద్ధ మాడతరు? పెతిరోజూ గాజులేయించుకో గాజులేయించుకో-పూలెట్టుకో మేమిత్తాములే డబ్బు—అని వేదించి చివరకి వేయించుకునేపాలికి యిలా గంటరు-అంత సేతకానోరు ముందెందుకనా లంత?"

అని మొహంఇంతలా చేసుకునికళ్లెర్రచేసి గద్దించింది.

"ఆహా...అన్నావే అనుకో సరదాకి—కాక పోయినా సెలాఖరుగదా మాదగ్గిర యిప్పుడే ముంటాయి చెప్పు?...నాలుగు రూపాయలదాకా చేశావే బిల్లు! మేమంతాకలిసి చందా వేసుకున్నా అంత చేరదే...! మా తల్లిగా! యిప్పటికెలాగో నీ వేయిద్దూ డబ్బొచ్చాక యిస్తాం లేనీకు." అన్నాడు బ్రతిమాలుతూ ఓ యోధుడు తెంపుచేసి.

"అదేమోనబ్బా! మీరు ఏకేరి వేయించినవేగా నాకేం? అంతాకలిసి ఎట్టాయిస్తరో యివ్వండి—నా దగ్గిరమాత్రం ఏదుంది?" అంటూ చేతులవంక తృప్తిగా గర్వంగా చూసుకుంటూ గాజుల గలగల లతో నిష్క్రమించింది.

చందాలు పోగుచేయడంలో చేయి దిరిగిన ఓ యువకుడు బయలుదేరాడు మిగిలిన గదుల్లోకి.

"కామ్రేడ్స్—మన పెరల్ గాజులేయించుకుందిరా. మీ దగ్గరేమయినా చిల్లరడబ్బులుంటే బైటపెట్టండి..." అంటూ తిరిగి తిరిగి పర్సులన్నీ గాలించి రెండుమ్ముప్పావలా పోగుచేసేసరికి గంట పట్టింది. గాజులబత్తుడు ఆ డబ్బు తీసుకుని మిగిలిన రూపాయి పావలాకీ నాలుగు రోజులాగవలసిందని గొణుక్కుంటూ బైటికి వచ్చాడు. అప్పుడే తడికతీసి గుడిసెలోకెళ్ళిన ముత్యాలు "సీ!—ఏం మగాళ్ళు" అనుకుంది అసహ్యంగా. ★

---

(38-వ పేజీ తరువాయి)

"అంతా తెల్లగా అయింది."

"నేను రానా?"

"వొద్దు నేనే వస్తా."

కేయాన్ బట్టలు మార్చుకుని వెళ్ళాడు.

"తోటవాడా?"

"అయ్!"

"ఇప్పుడు చెప్పు, పద్మావతి చావకమునుపు ఏం చేసింది?"

"బట్టలసాయబు దగ్గిర పదిరూపాయలు బట్టలు కొని, యాభై రూపాయలిచ్చిందయ్!"

"అప్పుడు నువేమన్నావ్? జ్ఞాపకం ఉందా?"

"అయ్! ఈ బట్టలబ్బి సాయిబల్లే ఉన్నా డన్నానె!"

"ఆమాట అన్నావ్?"

"అయ్!"

కేయాన్ బుర్ర గిర్రున తిరిగింది. సాయిబు! అగ్నిపర్వతం! ఫటాఫట్! కేయాన్ పరిశోధన ముగిసింది!

"ఏమయింది?" అంటూ వచ్చాడు సర్.

"ఏం కాలేదు. పద్మావతి ఆత్మహత్య చేసుకుంది!"

"ఇన్నిరోజులూ తిరిగి ఇదేనా నువ్వు కనుక్కున్నది?"

"అయ్—అంటే నా ఉద్దేశం, అంతేనండి!"

"ఇందుకేనా అంత డబ్బు నీబొందన పోసింది?" అంటూ సర్ సర్రున తుపాకీ తీసి కేయాన్ గుండెలోకి సూటిగా ఆరుగుళ్ళు పేల్చాడు.

సరిగా ఆదేసమయాన చెంచి, కేయాన్ విడిచిన చొక్కా జేబులు పరిశోధన చేస్తున్నది. ★